మంగ బెక్కుతూ. "మనం దొంగలమా మావా!"

అతడి బుజంమీద వాలిపోయింది.

"మీ యయ్య పోయాడని దుక్కంగుందా? దొంగవై పోనావని లావుదుక్కంగుందా —చెప్పు నా మంగీ!'.

"బతికి మనం దొంగలవై పోనాము మావా—అందుకే చెడ్డ దుక్కంగా వుంది నారంగా."

"సెబాసే—మంగా" అని ఆ పిల్లను వాటేసుగుని మొండిగోడ నవలీలగా లంఘించాడు రంగయ్య.

అంతే—

దూరాన్నుంచి పోలీసు యీలలువినిపించసాగాయి! బూట్ల చప్పుళ్లు దగ్గరగా రాసాగాయి!!?

ముసలమ్మ మరణం

చీకట్లో మొండిగోడవారన మెట్లదగ్గిర అలికిడికి, వస్తున్న వాడ్నల్లా ఆగి-

'ఎవరబ్బా! అరుగుమీద....'

'నే....న....రా' మూలుగుతూ కదుల్తోంది, ఎవరో మూటకట్టి మా అరుగుమీద పారేసిన కుళ్లు గుమ్మడిపండు.

'హ్హాఁ! నువ్వా బామ్మా! ఎట్లా వచ్చావ్?'

ఎప్పుడు వచ్చి కూర్చుందో, ఎట్లా దారి తెలుసుకుని వచ్చిందో!

'ఆ రష్యావాడు యిక్కడ దింపేశాడురా బాబూ!'

'ఏ రష్యావాడూ?'....'ఓహ్హో! రిక్షావాడా? లే బామ్మా! ఇట్లా అరుగుమీద కూర్చున్నావేఁ? లోపలికి పోదాంపా—'

'లేవలేనురా అబ్బాయి....'

కూచుంటే లేవలేదు. లేస్తే కూచోలేదు. చెంబు, మూటా పుచ్చుకుని కర్ర చేతికిచ్చి నిల్చోపెట్టాను. గొణుక్కుంటూ నన్ను చూసి.

'నువ్వు మాచెప్ప కొడుకువిగదూ,' అని కళ్ళొత్తుగుంటూ 'అయ్యొ నా రాతా—నా కంటే చిన్నవాళ్ళంతా పోయార్రా! కాని నాకు మాత్రం ఛావు రాకుండా వుంది."

నాకీ బామ్మ హస్తవాసి ఒకందుకు గుర్తు. ఒక మాటు ఆవిడ వెల [illegible] చేసింది. దానికోసం దేవదానవులు పోట్లాడుకుంటే [illegible]ల్లేదు. పులిహోరగాని పులుసుగాని చేస్తే దాన్ని అట్టే బెట్టుకుంటే రోజు రోజుకీ దాని రుచి యింతకు రెండింతలవుతుంది. పరుసవేది తగిల్తే అంతా బంగారమయినట్లు యీవిడ చేయి తగిల్తే ఏ పదార్థమైనా అమృత తుల్యమవుతుంది. పిల్లలకు యేదన్నా కాస్త నలత కనుపిస్తే ఆవిడ పోపుల పెట్టెను మెడికల్ ఛెస్టుగా వాడేసేది. అదంతా జ్ఞాపకమొచ్చి.

'బామ్మా నువ్వుచేస్తే వెలక్కాయపచ్చడి తినాలని వుంది.' అన్నా.

'అయ్యొ నే చచ్చిపోమా....యింకా వెలక్కాయ పచ్చడి గుర్తుందిబాబూ! కళ్లు కనపడవు నాయనా! చేతుల్లో శక్తి లేదురా తండ్రీ! నా వంటెవరిక్కావాలిరా....దిక్కుమాలి వంట....!

ఆ యెముకల పోగుని అభిమానించి యెత్తుకుని మెట్లన్నీ యెక్కి మేడమీదకు తీసుకెళ్ళాను.

'నువ్వెట్లా వచ్చావ్ పెద్దమ్మా?' అని నిలువు గుడ్లేసుకుని దారికడ్డంగావచ్చి నిలబడిపోయింది మా పిన్ని. మా మేనత్త పళ్ళు పటపటా కొరుకుతూ, స్నానాల గదికేసి నన్ను మళ్ళించి 'ఏవమ్మోవ్? పెద్దదానివి నీకు మేంచేయవలసిన వాళ్ళమే-కాదన్ను. నీకిక్కడేం సుఖం-కదలలేవు. ఐనవాళ్ళంతా వుంటూండగా తగుదునమ్మా అంటూ మధ్య పూసుగుని రావటానికి మే మెవళ్ళం?' అంది

'ఏ...వ...మా..ట్లా,..డే..ది? ర-త్తా-లూ-' చేతుల్తో బాత్‌రూం గచ్చుతేమగా వుండటాన్ని గమనిస్తూ 'ఏవేఁ నీ మొగుడిప్పుడు వూళ్ళో గొడవల జోలికి పోకుండా తిన్నగా వుంటున్నాడూ? అబ్బాయ్ ! నేల చల్లగావుందేం చెప్మా?' నేను పోయి స్టోరు రూం లోంచి గోనె సంచులు తెచ్చి నేలమీద పర్చి ముసలమ్మను కూర్చో బెట్టాను.

'సడే....నీకెంత సొహంతరంరా?' అని విసిరింది మా మేనత్త. నేనేదో ఘనకార్యం చేశాననుకున్నా. నా వుద్దేశం అంత చలితో చీకట్లో ఆ ముసలమ్మ అరుగుమీద బాధపడ్డం భావ్యంకాదని. పైగా ఆవిడేం పరాయి మనిషా-మా నాన్నకు స్వయానా మేనత్తే.

ఇంట్లోని ఆడవాళ్లంతా నన్ను లోపలికి పిల్చి—

'చావుకి సిద్ధంగావున్న ఆ ముండని మేడమీదకు తీసుగొస్తావ్? ఇంట్లో యెవళ్లనీ అడక్కుండా చెయ్యకుండా—వారే! నీ కిల్లాంటి బుద్ధులు పుడుతున్నాయేఁ?'

'అది చూస్తే తీసుగు తీసుగు ఛస్తోంది. రోగిష్టిదానికి చాకిరీ అంటే మాటలా? ఇంటినిండా పిల్లలు—చిన్న సంసారమా మనది. అంత జ్ఞానం లేకపోతే యెట్లా...'

'మన కొంపలోకి తెచ్చాక దానికి వైద్యం, డాక్టర్లూ—ఛస్తే రేపు బోల్డు కర్చు ఇవన్నీ నీకేం తెలుసు?'

'మనవేంతిన్నాం? మనకేం పెట్టింది? ఎవరు తిన్నారో వాళ్ళే పడతారు అవస్థలు!'

'లేనిపోని తద్దినాన్నెందుకురా యింట్లోకి యీడ్చుకొచ్చావ్?'

'వూరుకోండర్రా!!! పాపం బామ్మకు వినిపిస్తే...' నేను వెర్రి మొహం వేశాను.

'ఏం వినిపిస్తే?'

'నాన్నరానీ—'

బంధుత్వాలు క్షణికమనీ, మనుష్యుల విలవలు వున్నట్లుండి గమ్మత్తుగా తారుమారవుతాయని నా కప్పట్లో యేంతెలుసు? ఆవిడ వొంట్లో వోపిక వున్నంతికాలం అడ్డమైన చాకిరీ చేయించుకుని అంతా లొట్టలేస్తూ ఆప్యాయంగా తిన్నవాళ్ళే! మరి అంతా మహమ్మారిని చూసి ఝడుసుకున్నట్టు మాట్లాడ్తారే? నాన్న వచ్చాడు. వస్తూనే కొంపకు అగ్గి ముట్టుకుందని నామీద విరుచుకు పడ్డాడు.

'ఆ వుచ్చలూ పీతీళ్ళూ నేనె త్తిపోస్తాను. మీ కెవ్వరికీ యే శ్రమా వొద్దు.' అని అరిచాను.

'ఐతే చదువూ సంధ్యాలేకుండా ఈ ఆడంగి రేకుపనులన్నీ చేస్తూ కూర్చుంటావన్నమాట?' అంది పిన్ని యెగసనదోస్తూ.

'ఎవఁడ్రా నీ బాబు? ఐనవాళ్లకూ కానివాళ్లకూ ఈ వెట్టి చాకిరీ అంతా చెయ్యడానికి. ఎవడచ్చుకున్నాడు ? ఫో : ముందీ కొంపలోంచి ఆ ముండను బైటకు తీసుకుపోతావా లేక జంధ్యం తెంపుకుని నేనీకొంప లోంచి పైకి పోయేదా?'

నాన్నకు శివమెత్తిపోయింది.

'ఇంత రాత్రప్పుడా—చలిలోనా? ఎక్కడ దిగబెట్టిరాను?'

'ఏట్లో....కృష్ణలంకలో—' అని నాన్న చిందులు త్రొక్కుతూ బాత్‌రూం దగ్గరకెళ్ళి-

'నీ కూతురు అత్తారుండగా మామీదకొచ్చి పడ్డావేమే దయ్యమా? నీ మొగుడి ఆస్తి చుట్టుకున్నారుగా!. ఇంకేం వాళ్ళ గుమ్మంలో చావటం న్యాయం! పద! పద!'

'ఇంకెక్కడి కూతురత్తార్రా నాయనా? దాని ఆయుస్సూ మీఆయుస్సూ పోసుగుని నేనెందుకు బతికున్నాన్రా భగవంతుడా? అల్లుడా అని యే మొహం పెట్టుగుని పోన్రా తండ్రీ!' అని గోలు గోలున రాగాలు పెట్ట సాగింది.

'నువ్వేం అనుకోకు పెద్దమ్మా? వాళ్ళకూ మాకూ రాకపోకల్లేవా, నువ్విక్కడ వుండటం యేం బాగుండదు. మళ్ళీ నీ కానక యేంచెయ్యాలి సొచ్చినా యెవళ్ళకు విధాయకమో వాళ్ళ పంచకు పెందరాళే చేరుకోవటం సబబు. తిన్నవాళ్ళుచెయ్యకేంచేస్తారు? లోకం చూస్తూ వూరుకుంటుందా? చెప్పుచ్చు క్కొడతారు. ఆనకమేవంతాలేమూ?' అంది పిన్ని సముదాయిస్తూ.

'రిక్షా మెట్లదగ్గర ఆపుచేయించాను' అంది మా మేనత్త రొప్పుకుంటూ మేడమెట్లన్నీ యెక్కివచ్చి.

ఇక చేసేది లేక నేను మా నాన్నా ముసలమ్మను యీడ్చుకుంటూ వీధిలోకి లాక్కువచ్చాం. కర్రా, చెంబూ, మూటా రిక్షాలో సర్దుతూ 'కూర్చో బామ్మా!' అన్నా.

పడమటి దిక్కున కొండంత మేఘం తరుముకొస్తోంది. రివ్వున చలిగాలి వీచింది. రిక్షా కదుల్తూంటే చినుకులు దబదబా పడ్డం ఆరంభించాయి. వజవజా వణికిపోతూ నేను వెనకాతలే సైకిలు త్రొక్కుకుంటూ లాంతరు స్తంభాల్ని లెక్క పెడ్తున్నాను. ముసలమ్మ కుయ్ కయ్ మనటంలేదు. నాకు మనసంతా విరిగి గుండె నీరయిపోయింది.

పీడ వదిలించుకున్నామని తృప్తి పడుతున్నారే వీరంతా—యెల్లకాలమూ రోజులిల్లాగే గడుస్తాయనుకుంటున్నారా?

వీళ్ళకెవరికీ ముసలితనం రాదూ.

ఈ ఆస్తిపాస్తులు గౌరవ మర్యాదలు కలకాలం వుండేవా?

పురుళ్ళకనీ, పుణ్యాలకనీ, కార్యం కరామత్తుల్లో వొంటినిండా చాకిరీచేసి, గుప్పెడు మెతుకుల్తో, వొక సైను పంచె ఒక ఇత్తడి చెంబుతో జీవితాన్ని కృష్ణా రామా అంటూ కాలక్షేపం చేసిన మనిషి, శక్తులుడిగి కాలం ముంచుకొచ్చి మూలపడగానే పాతచెప్పుకన్నా హీనమైపోవాలా?

పనికిరానంత మాత్రాన ముసలమ్మ మనిషి కాకుండా పోయిందా?

ఆ మేడలు రెండూ యింకా ముసలమ్మ పేరనేవుంటే, కుక్కల్లా యెగబడే బంధువులు, చావు బ్రతుకుల్లోవున్న ఆ ప్రాణిని యింత హింస పెట్టాలా, చలిలో, వానలో, చీకట్లో.

గాంధీ నగరంనుంచి బయల్దేరిన రిక్షా బెజవాడ పాత టవును దుర్గ కొండ వీధికి చేరుకొనేసరికి వర్షం యెత్తిపోసింది. రిక్షావాలా తడిశాడు. నేను తడిశాను. ముసలమ్మ సరేసరి—చావలేదు.

అల్లుడిగారింటిముందు రిక్షా ఆపి తలుపులు దబదబా బాదాను.

'ఎవరు వారు, వస్తూంటే....'అని విసుగ్గా అరుపు. రిక్షాలోంచి దింపుతూంటే ముసలమ్మ 'కూతురా, కూతురా!' అంటూ ఏకగోల! తలుపులు పూర్తిగా తెరవబడకుండానే 'బామ్మగారొచ్చారు' అంటూ నేనూ రిక్షా వాలా కలిసి ముసలమ్మగారిని సునాయాసంగా లోపలికి నెట్టి, పిలుస్తున్నా వెనక్కి తిరక్కుండా ఛపాయించేశాం. తరువాత ఆ చచ్చిపోయిన కూతురి అత్తారు వియ్యపరాలిని ఉచితరీతిని సత్కరించారో, ఆ మెట్లమీదే వానలో రాత్రల్లా వదిలేశారో, ఆ ప్రాణిపట్ల యే అజ్ఞాత హృదయంలోనైనా రవ్వంత సానుభూతి దయకలిగిందో లేదో భగవంతుడికి మాత్రమే తెలుసు. అతడుకూడా యీ విరిగిన చెట్టుని తప్పించుకునే తన రథాన్ని తోలాడు. మృత్యువు రమ్మని పిలవలేదు. చిత్రగుప్తుడు పాపపుణ్యాల లెక్కలుకట్టి హుకుం జారీచెయ్యటానికికూడా జాప్యం చేస్తూ వచ్చాడు. యముని మహిషపులోహ ఘంటలు విందామని కూర్చున్న ముసలమ్మకు పిలుపు మాత్రం రాకుండావుంది.

చావుని గురించి అదేదో భీభత్సంగా వూహించుకోవడం తప్పించి మనుష్యులు దానికోసం తాపత్రయపడతారనీ. ఆ ప్రయత్నాలలోవున్న వారిని తప్పించుకు తిరగాలని గ్రహించే పాటి వయస్సుకూడా కాదునాది,

తరువాత నేను కర్ణాకర్ణిగా విన్నది, ఆ మాజీ అల్లుడుకూడా ముసలమ్మను ఆ మర్నాడే రైలుస్టేషనుకు తీసుగెళ్ళి బందరు టిక్కెట్టుకొని యిచ్చి రైల్లో కూర్చోబెట్టి పంపించేశాట్ట! ఒక్కర్తీ ఆవిడ రైలు ఎట్లా

దిగిందో, పుణ్యాత్ములెవరు సాయపడ్డారో వూళ్ళో ధర్మాసుపత్రిలో చేర్పించేశార్ట. ఇక యీవిడ అధ్యాయం బందర్లో ముగిసేదే తిరిగి రాదను కున్నాం, కాని—ఆశ్చర్యం! అక్కడ పరాయి వూళ్ళో ప్రాణం వదల్టా నికి మన సొప్పలేదట. స్వగ్రామం, పవిత్రమైన కృష్ణానతీ తీరం—పోతే ప్రాణాలు యిక్కడ్నే పోవాలిట. మళ్ళీ ఎక్కేగుమ్మం దిగే గుమ్మం—ఐనవాళ్ళ కొంపలన్నీ చుట్టాక, అందరూ ఛీ! ఛీ! అన్నాక ఆవిడకేమని పించిందో, పాతవూళ్ళో మునుపు పునిస్త్రీగా మొగుడి హయాంలో అర్ధణాకాసంత బొట్టూ, వొంటెడు నగలూ మనిషి నిండుగా మెట్టిన సొంత యింటి అరుగు పంచకు చేరింది.

'ఎవరో ముసలమ్మ పాపం అరుగుమీద కూర్చుంది' అను కున్నారంతా.

'ఎవర్నో కానర్రో—ఇది నా మొగుడి ఆస్తి, ఈ అరుగు నాదే నర్రో!!!' అనుకుంది ముసలమ్మ.

పగలంతా సూర్యుడి ప్రతాపం మూలనున్న ముసలమ్మమీదే— అరుగుమీద పెనంమీది అట్టులా మాడసాగింది. ఇరుగూ పొరుగూ మర్యాద స్తులూ, రోడ్డుమీద ఆడుకునే పిల్లలూ, కూరలవాళ్ళూ, పాలూ పెరుగూ అమ్ముకునేవాళ్ళూ, రాత్రిళ్ళు కుక్కలూ, పందులూ, ఎండకు ఎండ, వానకు వానా, తడిసి చీకి చీకి పెంటపోగులా మూడు రోజులు కుళ్ళింది. కాని ప్రాణాలు మాత్రం ఆ కాయాన్ని వదిలిపోవటంలేదు.

'అరటి పండు తినాలనుంది పెట్టరూ?' అంటూ దారినిపోయే అర్జంటు పనుల ఆసామీలని అడుక్కునేది. హడావిడిలో చూసీ చూడ కుండా కానులు అర్ధణాలూ పారేసే పుణ్యాత్ములు, కాస్తదయ గలిగి యిత్తడి చెంబులోకి నీళ్ళు వొంపే ధర్మాత్ములూ....

ఎంత దిక్కుమాలిన చావు రాసిపెట్టుంది యీ ముసలమ్మ కనుకున్నారు.

కాని వాళ్ళకేం తెలుసు?

ఈ ముసలమ్మ వొకప్పుడు పట్టు ఛనారసు చీరలు కట్టుకుని, పసుపూ కుంకుమా మెత్తుకుని, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, నేనూ నావారూ అంటూ హోషుగా బ్రతికేదని—రక్తమాంసాలు, ఎముకలూ శిథిలమయే దాకా అయిన వాళ్ళకీ కాని వాళ్ళకీ అడ్డమైన చాకిరీ చేసేదనీ—

ఆస్తిపాస్తుల్నీ, వయస్సునీ శాశ్వతమని నమ్ముకునే లోకానికి బరువైన బొమ్మ దీనంగా మృత్యువుని అడిగింది—

'నీ సుఖం నాకు కాస్త పంచి యివ్వరాదా' అని,

బ్రాహ్మణ వితంతువు కాలంచేస్తే పాడెకట్టి మోసుగుపోయేం దుకు కూడా ఎల్లాటి యేర్పాట్లు జరగలేదు. తెల్లవారుఝామునవగా ముసలమ్మగుటుక్కుమంటే మ్యునిసిపాలిటీవారికి కబురుచేస్తే పదకొండు గంటలకి ఎద్దుబండీ, యిద్దరు వెట్టివాళ్ళూ వచ్చి ఆ జితించిన కోర్కెల గూడుని కృష్ణలంక వైపుకు లాక్కెళ్ళారు.

అరుగుమీద ఫినాయిలుపోసి కడిగారు,

సాయంత్రం చీకటి పడ్డాక పిల్లలు ఆ అరుగువైపు ఆడుకోవటా నికి రావటం మానేశారు.

అన్నట్లు మ్యునిసిపాలిటీ చావు బ్రతుకుల రిజిస్ట్రారువారి వుద్యో గులకి కబురు చెప్పేవాళ్ళు లేరు. ఎవరీముసలమ్మ పాపమని నలుగురూ అడిగితే, శివ శివా! మాకు తెలీదంటే మాకు తెలీదన్నారంతా!